# నెత్తిన కేబుల్ వైర్ల కత్తి

- విద్యుత్ స్తంభాలపై ఇష్టారీతిన ఏర్పాటు
- ఇళ్లను ఆనుకుని తీగలు ఉండటంతో స్థానికుల ఆందోళన
- భీతిల్లిన్న బలరామ్‌నగర్ కాలనీవాసులు

**మద్దిలపాలెం:** ప్రభుత్వ విద్యుత్ స్తంభాలను వినియోగించుకుని కేబుల్ ఆపరేటర్లు ఇష్టారాజ్యంగా కేబుళ్లు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో విద్యుత్ స్తంభాలు కేబుల్ వైర్లతో నిండిపోతున్నాయి. ఆయా లైన్లు సైతం ఒక క్రమపద్ధతిలో కాకుండా ఇష్టానుసారంగా, అస్తవ్యస్తంగా వేస్తున్నారు. దీంతో విద్యుత్ స్తంభాలు కేబుల్ వైర్లతో గజిబిజిగా కనిపిస్తున్నాయి. అయినా ఈ విషయం సంబంధిత శాఖాధికారులు పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. ఇలా కుప్పలు తెప్పలుగా వేలాడుతున్న కేబుల్ వైర్ల వల్ల విద్యుత్ షార్ట్ సర్క్యూటై నిప్పు రవ్వలు వెలువడి ఇటీవల బలరామ్‌నగర్‌లో ప్రమాదం చోటు చేసుకుంది. ఇలాంటి ఘటనల నేపథ్యంలో కేబుల్ వైర్ల ఏర్పాటుకు ప్రత్యేకంగా పోల్స్ వేసుకుని లైన్లు ఏర్పాటు చేసుకోవాలని ప్రజలు అంటున్నారు.

### కేబుల్, ఇంటర్నెట్ ఆపరేటర్ల ఇష్టారాజ్యం..

సర్కారు విద్యుత్ స్తంభాలను యథేచ్ఛగా వాడుకుంటూ ప్రైవేట్ కేబుల్ ఆపరేటర్లు సొమ్ము చేసుకుంటున్నారు. నిబంధనల మేరకు విద్యుత్ స్తంభాలకు ఎలాంటి వైర్లు, కేబుళ్లు ఏర్పాటు చేయకూడదు. కానీ తూర్పులో చాలా చోట్ల నిబంధనలు అమలు జరగడంలేదు. విద్యుత్ స్తంభాలకు కుప్పతెప్పలుగా వేలాడుతున్న కేబుల్ వైర్ల మాటున పక్షులు గూడు కట్టుకుంటున్నాయంటే ఇవి ఎంత అస్తవ్యస్తంగా ఉన్నాయో అర్థమవుతోంది.

### ఇళ్లకు తగిలేలా వైర్ల ఏర్పాటు..

పలు చోట్ల కేబుల్ ఆపరేటర్లు స్తంభం నుంచి మరో స్తంభానికి లైన్లు వేస్తున్నారు. అక్కడి నుండి మధ్యలో ఉన్న ఇళ్లకు ఆ లైన్లు కలుపుతున్నారు. దీంతో ఇళ్లకు తగిలేలా కేబుల్ వైర్లు ఏర్పాటవుతున్నాయి. ఇలా చేయడం వల్ల ఎప్పుడు ఎలాంటి ప్రమాదం వాటిల్లుతుందో అని స్థానికులు భయపడుతున్నారు.



బలరామ్‌నగర్‌లో విద్యుత్ స్తంభంపై దగ్ధమవుతున్న కేబుల్ వైర్లు (ఫైల్)



మంగాపురం కాలనీ నుంచి బలరామ్‌నగర్‌కు వెళ్లే లైన్‌లో విద్యుత్ కేబుల్ లైన్లు



బలరామ్‌నగర్‌లో విద్యుత్ స్తంభాలకు కుప్పలు తెప్పలుగా కట్టిన కేబుల్ వైర్లు



విద్యుత్ స్తంభానికి వేలాడుతున్న కేబుల్ వైర్లు

**బలరాంనగర్‌లో కేబుల్ వైర్ల దగ్ధం..**

జీవీఎంసీ 22వ వార్డు బలరామ్‌నగర్‌లో ఇటీవల అందరూ నిద్రకు ఉపక్రమిస్తున్న సమయంలో ఒక్కసారిగా విద్యుత్ స్తంభం నుంచి నిప్పు రవ్వలు పడుతూ మంటలు చెలరేగాయి. ఇది చూసి కాలనీవాసులు ఇళ్లలోంచి బయటికి పరుగులు తీశారు. భారీ ఎత్తున ఎగసి పడుతున్న మంటలను చూసి భయాందోళనలకు గురయ్యారు. ఈ సమాచారాన్ని అగ్నిమాపక సిబ్బంది, విద్యుత్ శాఖ అధికారులు చేరవేశారు. కాలనీవాసులు మంటలపై ఇసుక చల్లి మంటలను అదుపు చేసే ప్రయత్నం చేశారు.

**ప్రమాదం జరిగింది ఇలా..**

బాలరామ్‌నగర్ కాలనీలో విద్యుత్ స్తంభాలపై ఏర్పాటు చేసిన కేబుల్ వైర్ల మధ్యలో పక్షులు కట్టిన గూడుపై విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయి నిప్పురవ్వలు ఎగసిపడ్డాయి. దీంతో నిప్పంటుకుంది. ఆ నిప్పు కాస్త కేబుళ్ల వరకూ పాకి పెద్ద పెద్ద మంటలు చెలరేగాయి. దీంతో కాలనీవాసులు భీతిల్లిపోయారు. కేబుల్ వైర్లు విద్యుత్ స్తంభాలకు అనుసంధానం కావడమే దీనికి కారణమని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**ఇకనైనా స్పందించండి మహాప్రభో..**

ప్రమాదాలకు నిలయంగా మారుతున్న విద్యుత్ స్తంభాలపై కేబుల్ వైర్ల ఏర్పాటుకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేస్తున్న కేబుల్ వైర్లను సంబంధిత అధికారులు తొలగించాలని కోరుతున్నారు.

## అవగాహనతోనే డెంగ్యూ నివారణ



గురుకులం గేటు వద్ద ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు, యూపీహెచ్‌సీ సిబ్బంది

**ఆరిలోవ:** జాతీయ డెంగ్యూ మాసోత్సవాలలో భాగంగా శుక్రవారం జీవీఎంసీ 13వ వార్డు శ్రీకృష్ణాపురంలో యూపీహెచ్‌సీ వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా ఇక్కడ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకులంలో విద్యార్థులకు డెంగ్యూపై అవగాహన కల్పించారు. దోమలు వ్యాప్తి చెందకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని డాక్టర్ మహిత విద్యార్థులకు సూచించారు. అనంతరం ప్లకార్డులు పట్టుకుని గురుకులం గేటు వరకు ర్యాలీగా వెళ్లి బీఆర్‌టీఎస్ రోడ్డు ముందు ప్రదర్శించారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని, దోమలు వ్యాప్తి చెందకుండా జాగ్రతలు పాటించాలని, నీటి తొట్టిలపై మూతలు పెట్టుకోవాలని రాసిన నినాదాలతో ప్లకార్డులు ప్రదర్శించారు. కార్యక్రమంలో యూపీహెచ్‌సీ నర్సింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మత్స్యకారులకు బోటు ఇంజిన్లు, వలల పంపిణీ

**ఎంవీపీకాలనీ:** జిల్లా మత్స్యకార శాఖ ఆధ్వర్యంలో జాలరి ఎండాడ, వాసవానిపాలెం మత్స్యకారులకు రాయితీపై ఇంజిన్లు, వలలు పంపిణీ చేశారు. ప్రధాన మంత్రి మత్స్యకార సంపద యోజనలో భాగంగా శుక్రవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మత్స్యకారులకు 16 బోటు ఇంజిన్లు, 6 ఫిషింగ్ వలలు అందజేశారు. 40 శాతం రాయితీపై 22 యూనిట్లను అర్హులైన మత్స్యకారులకు అందించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో మత్స్యకార శాఖ జేడీ లక్ష్మణరావు, స్థానిక కార్పొరేటర్ మంగవేణి తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### తరగతుల్లో 'యూ' సిట్టింగ్ ఏర్పాటు చేయాలి



డీఈవో ప్రేమకుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న నరవ ప్రకాష్

**ఆరిలోవ:** పాఠశాలల తరగతి గదుల్లో ఆంగ్ల అక్షరం 'యూ' ఆకారంలో విద్యార్థులను కూర్చోబెట్టే విధానం అమలు చేయాలని కోరుతూ బాల వికాస్ ఫౌండేషన్ కార్యదర్శి నరవ ప్రకాష్ శుక్రవారం డీఈవో ఎన్.ప్రేమ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లాలోని అన్ని పాఠశాలల్లోనూ ఈ విధానం అమలు చేస్తే విద్యార్థులకు మేలు జరుగుతుందన్నారు. దీన్ని పరిశీలించి అమలు చేయడనికి కృషి చేస్తానని డీఈవో తెలిపారని ఆయన పేర్కొన్నారు. దీని గురించి విద్యా శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్తున్నట్లు తెలిపారు.

### అభివృద్ధి పనుల పరిశీలన



శివాజీపాలెంలో పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ ముచ్చల లక్ష్మి

**బీచ్‌రోడ్డు:** జీవీఎంసీ 20వ వార్డు శివాజీపాలెంలో జరుగుతున్న నూతన కాలువలు, రోడ్ల పనుల నాణ్యతను శుక్రవారం కార్పొరేటర్ ముచ్చల లక్ష్మి సురేష్ పరిశీలించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని కాంట్రాక్టర్‌కు ఆమె సూచించారు. జీవీఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ అప్పలనాయుడు, 20వ వార్డు అధ్యక్షుడు యనమరెడ్డి కుమార్‌రెడ్డి, తూర్పు నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు కాగితాల రవికిరణ్ రెడ్డి, వార్డు నాయకులు పాల్గొన్నారు.

### శ్రావణలక్ష్మికి విశేష పూజలు



విశేష అలంకరణలో కనకదుర్గమ్మ

**మద్దిలపాలెం:** జీవీఎంసీ 16వ వార్డు సంజయ్ గాంధీ కాలనీలో కొలువై ఉన్న కనకదుర్గ అమ్మవారి ఆలయంలో శుక్రవారం ఘనంగా శ్రావణ లక్ష్మి పూజలు జరిపారు. శ్రావణ మాసం మొదటి శుక్రవారాన్ని పురస్కరించుకుని మహిళలంతా తమ ఇంట్లో పూజలు చేసుకుని ఆలయానికి వచ్చి అమ్మవారికి పసుపు, కుంకుమలు సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారిని వివిధ పుష్పాలతో కనుల పండువగా అలంకరించారు. ఆలయ అర్చకులు వెంకటరావుశర్మ భక్తుల గోత్ర నామాలతో అభిషేకాలు, అర్చనలు జరిపారు. అనంతరం మహిళలచే సామూహిక కుంకుమార్చన చేయించారు.

### మూడు కిలోల గంజాయి స్వాధీనం

**ఆరిలోవ:** ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలో కొందరు వ్యక్తులు గుట్టుగా దాచిపెట్టిన మూడు కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆరిలోవ ఎస్ఐ రాందాస్ తెలిపిన వివరాలు ప్రకారం.. విశాఖ వ్యాలీ స్కూల్ ప్రాంతంలో కొందరు వ్యక్తులు గంజాయితో తిరుగుతున్నట్లు ఆరిలోవ పోలీసులకు శుక్రవారం సమాచారం అందింది. ఎస్ఐ సిహెచ్.రాందాస్ సిబ్బందితో విశాఖ వ్యాలీ స్కూల్ పక్కన కూచిపూడి నాట్యమండలి భవనం వెనుక కొండ అంచున పరిశీలించారు. ఓ చోట తుప్పల్లో ప్యాకెట్లను మూటకట్టి దాచిపెట్టిన గంజాయితో నలుగురు వ్యక్తులు పోలీసులకు పట్టుబడ్డారు. వారిని అదుపులోకి తీసుకొని గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వారిని ఆరా తీయగా.. ఎండాడ ప్రాంతానికి చెందిన దాడిశెట్టి గిరిధర్, పండవ ప్రేమ్‌కుమార్, బూసి నరేష్‌కుమార్, దేగల సన్నిబాబుగా గుర్తించారు. నిందితులను కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్ఐ తెలిపారు.

### పరిసరాల పరిశుభ్రతతోనే మెరుగైన ఆరోగ్యం

**మహారాణిపేట:** జబ్బర్‌తోట పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలోని పలు ప్రాంతాలను శుక్రవారం డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు సందర్శించారు. బీచ్ రోడ్డు, జాలరిపేట, నేవల్ క్యాంటీన్ ఏరియాల్లో జరుగుతున్న అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు, ఇతర పథకాల గురించి స్థానికులకు వివరించారు. డయాగ్నోస్టిక్ సేవలు, మందుల వినియోగం, కాంప్రహెన్సివ్ స్క్రీనింగ్, రిఫరల్ సేవల గురించి అక్కడి వైద్యులు, సిబ్బందికి వివరించారు. అభ ఐడీ మ్యాపింగ్ శతశాతం సాధించాలని ఆదేశించారు. వ్యాధుల నివారణకు నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

## ప్రతి గడపకూ బాబు మోసాలు



వైఎస్సార్‌సీపీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తున్న తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు

**మద్దిలపాలెం:** కూటమి ప్రభుత్వ వైఫల్యాలు, మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు పిలుపునిచ్చారు. సీతమ్మధారలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం తూర్పు శ్రేణులతో ఆయన సమావేశమై దిశానిర్దేశం చేశారు. బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ పేరుతో తూర్పులోని ప్రతి గడపకూ వెళ్లి ముఖ్యమంత్రి చంద్రబాబు చేస్తున్న మోసాలు, దగాను తెలియజేయాలన్నారు. ఆదివారం నుంచి అన్ని వార్డుల్లోని ప్రతి బూత్‌లో, గడపలో కూటమి ప్రభుత్వం ప్రజలకు చేసిన మోసాన్ని వివరించాలన్నారు. ఇంటింటికీ ఈ కార్యక్రమ కరపత్రం ఇచ్చి దానిలోని లోగోకు స్కాన్ చేయించాలని సూచించారు. నివాసులు ఏ విధంగా ఎంత మోసపోయారో తెలియజేయాలని చెప్పారు. కార్యక్రమాన్ని నూరు శాతం విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్ర మత్స్యకార విభాగం అధ్యక్షుడు పేర్ల విజయచందర్, జిల్లా అధికార ప్రతినిధి పల్లా దుర్గారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ముచ్చల సురేష్, జిల్లా కార్యదర్శి ఉమ్మిడి దాసు, పీతల గోవింద్, సుబ్రహ్మణ్యం, పులగం శ్రీనివాస్ రెడ్డి, బెవర జగదీశ్, పీలా ప్రేమ్‌కిరణ్, పతివాడ కనకరాజు, మొల్లి హేమంత్, సత్యాల వెంకట్, పులగం కొండారెడ్డి, సూరాడ దాసు, సూర్యనారాయణరెడ్డి, నీలారెడ్డి, ఉమ్మిడి కల్యాణ్, కుమార్ రెడ్డి, మధుపాడ రవి, బూస రమణరెడ్డి, రాపాక శ్రీనివాస్, రవికిరణ్ రెడ్డి, విక్టర్, నమ్మి లవన్‌కుమార్, శ్రీనివాస్ పాత్రో, బొండా శ్రీనివాస్, వైద నారాయణరావు, ఇమంది సత్యనారాయణ, యనమరెడ్డి కుమార్‌రెడ్డి, కుమార్‌రెడ్డి, కోలా కామేష్ పాల్గొన్నారు.

## ప్రొఫెసర్ కృష్ణారావుకు వెటరన్ హైడ్రోజియాలజిస్ట్ అవార్డు

**మద్దిలపాలెం:** ఆంధ్ర విశ్వవిద్యాలయం విశ్రాంత ప్రొఫెసర్ జి.కృష్ణారావుకు వెటరన్ హైడ్రోజియాలజిస్ట్ అవార్డు లభించింది. జైపూర్ అమిటీ విశ్వవిద్యాలయంలో జరిగిన సెమినార్‌లో ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఆఫ్ హైడ్రోజియాలజిస్ట్స్‌కి చెందిన ఇండియన్ నేషనల్ చాప్టర్ ద్వారా ఆయనకు ఈ అవార్డు ప్రదానం చేశారు. దేశంలోని ఐదుగురు అత్యంత సీనియర్ హైడ్రోజియాలజిస్టులను వారి సేవలు, పనితీరు ఆధారంగా గుర్తించి అవార్డులు అందజేశారు. వీరిలో ఏయూ రిటైర్డ్ ప్రొఫెసర్ జి.కృష్ణారావు స్థానం సాధించారు. సదస్సులో ప్రచురించిన 99 పరిశోధన పత్రాల్లో ప్రొఫెసర్ కృష్ణారావు పరిశోధన పత్రానికి మొదటి స్థానం లభించింది.

## రాయల్ కంఫర్ట్ లాడ్జిలో జూదం

- ఎంవీపీ పోలీసుల అదుపులో ఐదుగురు

**ఎంవీపీకాలనీ:** ఎంవీపీ కాలనీ సెక్టార్-3లోని రాయల్ కంఫర్ట్ లాడ్జిలో జూదం నిర్వహణపై ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. లాడ్జిలోని 201 రూమ్‌లో జూదం(కోత ఆట) ఆడుతున్నట్లు వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు ఎంవీపీ పోలీసులు దాడులు చేశారు. కొందరిని జూదం ఆడుతున్నట్లు గుర్తించి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.49,300 నగదు, 52 నంబర్ల ప్లేయింగ్ కార్డులు స్వాధీనం చేసుకున్నారు. కోత ఆట నిర్వహించేందుకు ఒక వ్యక్తి అందరినీ సమీకరించి లాడ్జిలో రూమ్ బుక్ చేసి ఆట మొదలైన అనంతరం అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు వారు వెల్లడించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఆ వ్యక్తి కోసం ఎంవీపీ పోలీసులు గాలిస్తున్నారు. ఏపీ గేమింగ్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సీతమ్మధార ట్రెజరీలో.. తప్పుడు బిల్లుల బాగోతం

- ఎస్‌టీవో ప్రమేయం లేకుండా బిల్లులు సిఫారసు చేస్తున్న ట్రెజరీ ఉన్నతాధికారి

**మహారాణిపేట:** సీతమ్మధార సబ్ ట్రెజరీ కార్యాలయం అక్రమాలకు నిలయంగా మారిందని జోరుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో ఇక్కడ అనేక కుంభకోణాలు, దొంగ బిల్లుల చెల్లింపు, ఉద్యోగులపై సస్పెన్షన్ వంటి ఘటనలు చోటు చేసుకున్నాయి. అయినా ఇక్కడి అధికారులు, సిబ్బందిలో ఎలాంటి మార్పు లేదు. ఇప్పుడు ఇదే కార్యాలయం నుంచి తప్పుడు బిల్లుల సిఫారసులు జోరుగా సాగుతున్నాయి. ఈ కార్యాలయంలో సంబంధిత సబ్ ట్రెజరీ అధికారి (ఎస్‌టీవో) ప్రమేయం లేకుండా అనేక బిల్లులకు సిఫార్సులు చేయడం విశేషం. దీర్ఘకాలికంగా సెలవులో ఉన్న జిల్లా ట్రెజరీ అధికారి వై.సుధాకరరావు విధుల్లో చేరిన తర్వాత ప్రీ ఆడిట్ బిల్లుల పరిశీలనలో ఒక బిల్లు నిబంధనలకు విరుద్ధంగా ఉండడంతో దాన్ని వెనక్కి తిప్పి పంపారు. వివరాలు ఇవి.. ప్రభుత్వ కాలేజీలో లెక్చరర్‌గా పని చేస్తున్న జి.ఈశ్వర వర్మ 1994 డిసెంబర్ 31వ తేదీన రిటైర్ అయ్యారు. ఇతను 2015 డిసెంబర్ 27వ తేదీన చనిపోయారు. తర్వాత సర్వీస్ పెన్షన్, ఇతర అరియర్స్, డీఏతో కలుపుకుని మొత్తం రూ.36 లక్షల వస్తాయని లెక్కలు వేశారు. కొన్ని బిల్లుల చెల్లింపునకు అర్హత లేకపోయినా చెల్లించడానికి పెద్ద మొత్తంలో బేరం కుదుర్చుకుని సీతమ్మధార సబ్ ట్రెజరీ కార్యాలయంలో బిల్లులు సిద్ధం చేశారు. సీనియర్ అకౌంటెంట్ ఈ మొత్తం ప్రక్రియను తయారు చేసి సిఫారసు చేశారు. సంబంధిత ఎస్‌టీవోకు ప్రమేయం లేకుండా సంబంధిత కార్యాలయం అసిస్టెంట్ ట్రెజరీ అధికారి సంతకం చేశారు. అప్పటి ఇన్‌చార్జి డీటీవోగా కూడా ఇక్కడ అసిస్టెంట్ ట్రెజరీ అధికారి పని చేశారు. ఇంతలో సెలవు పూర్తి కావడంతో జిల్లా ట్రెజరీ అధికారి (డీటీవో) వై.సుధాకరరావు విధుల్లో చేరారు. అనేక ఆరోపణలు రావడంతో ప్రీ ఆడిట్‌లో బిల్లులను క్షుణంగా పరిశీలించారు. ఇందులో ఈశ్వర వర్మ ఫ్యామిలీ పెన్షన్ వ్యవహారం బయట పడింది. ఈ బిల్లు అంతా తప్పుల తడకగా ఉన్నట్లు గమనించి బిల్లులను డీటీవో సుధాకరరావు వెనక్కి పంపారు. ఆ ఫ్యామిలీకి లేనిపోని ఆశలు కల్పించి వారితో లాలూచీ పడినట్టు ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పుడు ఈ బిల్లు వెనక్కి రావడంతో ముందుగా తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వాలని వారు కోరారు. మళ్లీ తాను త్వరలో ఇన్‌చార్జి డీటీవోగా వస్తానని, అప్పుడు పూర్తి చేస్తామని వారికి నమ్మబలుకుతున్నట్టు సమాచారం.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

**ఎంవీపీకాలనీ:** వెంకోజీపాలెం కూడలి దరి జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటనపై ఎంవీపీ పోలీసులు తెలిపిన వివరాలిలా.. నూతన్ హెల్త్ సర్వీస్‌లో లిమిటెడ్ ఉద్యోగులైన అరిగిల నాగేశ్వరరావు, గురాన రమేష్‌లు శుక్రవారం ఉదయం తగరపువలస వెళ్లేందుకు ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. ఉదయం 9.40 గంటల సమయంలో వెంకోజీపాలెం కూడలి దాటి హనుమంతవాక వైపు వెళ్తుండగా సీఎంఆర్ ఫంక్షన్ హాల్ ఎదుట జాతీయ రహదారిపై వెనుక నుంచి వచ్చిన ఓ గుర్తు తెలియని కారు వారిని బలంగా ఢీకొట్టింది. దీంతో నాగేశ్వరరావు తలకు తీవ్ర గాయాలు కాగా.. రమేష్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. అటుగా వెళ్తున్న వారు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై నాగేశ్వరరావు బంధువు చింతలపూడి ప్రవీణ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎంవీపీ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించండి



కరపత్రం అందిస్తున్న పడాల గోవింద్

**మద్దిలపాలెం:** విద్యుత్ స్మార్ట్ మీటర్లను ప్రజలంతా వ్యతిరేకించాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శుక్రవారం 15వ వార్డు డాక్టర్స్ కాలనీలో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పడాల గోవింద్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యుత్ బిల్లుల భారం మోపుతోందన్నారు. ప్రజలపై బిల్లుల మోత మోగించడానికి స్మార్ట్ మీటర్లతో దండయాత్రకు బయలుదేరిందన్నారు. ప్రజలు విద్యుత్ ఎక్కువగా వాడే సమయాల్లో చార్జీలు ఎక్కువ వసూలు చేస్తారన్నారు. వేసవిలో దీని భారం మరింత ఎక్కువగా ఉంటుందన్నారు. ఇవి ప్రీపెయిడ్ మీటర్లని ప్రజలు గుర్తించవలసిన అవసరం ఉందని తెలిపారు. స్మార్ట్ మీటర్లు ఖరీదుతోపాటు దాని రిపేర్‌కు అయ్యే ఖర్చులు కూడా ప్రజలే భరించాలన్నారు. ఈ నేపథ్యంలో స్మార్ట్ మీటర్లు పెట్టే విధానాన్ని ప్రజలు తిరస్కరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు అవనాపు శ్రీను, బి.హరి, సూరిబాబు నాయుడు, సోములు తదితరులు పాల్గొన్నారు.

## ఆసియా సైన్స్ క్యాంప్‌నకు కృష్ణా కళాశాల విద్యార్థి



విద్యార్థి నందివర్ధన నాయుడికి చెక్కు అందజేస్తున్న కళాశాల అధ్యాపక బృందం

**మద్దిలపాలెం:** ప్రతిష్టాత్మకమైన ఆసియా సైన్స్ క్యాంప్-2025లో పాల్గొనడానికి న్యూఢిల్లీలోని సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం నామినేట్ చేసిన 20 మంది భారతీయ విద్యార్థుల్లో డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల(ఎ) బీఎస్సీ ఫైనలియర్ విద్యార్థి లెంకా నందివర్ధన నాయుడు ఎంపికయ్యాడు. ఈ శిబిరం ఈ నెల 31 నుంచి ఆగస్టు 6 వరకు థాయిలాండ్‌లోని సురానారీ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీలో జరగనుంది. క్యాంప్‌లో నోబెల్ గ్రహీతలు ప్రపంచవ్యాప్తంగా ప్రఖ్యాత శాస్త్రవేత్తలతో అర్థవంతమైన సంభాషణ చేయనున్నారు. ఆసియా అంతటా శాస్త్రీయంగా ప్రతిభావంతులైన యువతను ప్రేరేపించడమే ఈ క్యాంప్ లక్ష్యం. నందివర్ధన నాయుడు సాధించిన విజయానికి గుర్తింపుగా శుక్రవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు, అధ్యాపక బృందం అభినందించారు. విద్యార్థికి ఆర్థిక సాయంగా రూ.10,000 చెక్కును అందజేశారు.

## సమాచార హక్కు చట్టంపై అవగాహన అవసరం



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులతో కృష్ణా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబు

**మద్దిలపాలెం:** సమాచార హక్కు చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు సూచించారు. కళాశాల విద్యా డైరెక్టర్ ఆదేశానుసారం సమాచార హక్కు చట్టం-2005 ప్రారంభించి 20 ఏళ్లయిన సందర్భంగా కృష్ణా డిగ్రీ కళాశాలలో సోమవారం నుంచి గురువారం వరకు ఈ చట్టం అంశంపై విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, డిబేట్, క్విజ్ పోటీలు నిర్వహించారు. కళాశాల స్థాయిలో గెలిచిన విద్యార్థులను ఎస్ఆర్సీ స్థాయిలో పాల్గొంటారని విజయబాబు తెలిపారు. ఆగస్టు 1 నుంచి పోటీలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ, కో ఆర్డినేటర్ డాక్టర్ ఎ.ఎల్.రూపవాణి, సమాచార హక్కు చట్టం కో ఆర్డినేటర్ డాక్టర్ పి.ఉమామహేశ్వరరావు, డాక్టర్ ఎస్.శారద, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థిని చదువుకు సాయం



విద్యార్థిని భవ్యశ్రీకి ఆర్థిక సాయం అందిస్తున్న దాతలు, సంఘ సభ్యులు

**బీచ్‌రోడ్డు:** పెదవాల్తేరు గ్రామ సేవా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఓ పేద విద్యార్థినికి చదువు ఆర్థిక సాయం చేశారు. 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన వాకాడ భవ్యశ్రీకి ఉన్నత చదువుల కోసం ఎంఎల్ రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి జ్ఞాపకార్థంగా వారి కుటుంబ సభ్యులు రూ.లక్ష అందజేశారు. పెదవాల్తేరులో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ సంఘ అధ్యక్షుడు బి.తవిటిరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ముందుకొచ్చి ఆర్థిక సాయం చేసినట్లయితే చాలా మంది పేద విద్యార్థులకు చదువుకునే అవకాశం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో కర్రి పుష్పారెడ్డి, మాధవి, ప్రవీణ్, పద్మజా, మద్ది అప్పలరెడ్డి, కర్రి పోలమ్మ, గ్రామ సేవా సంఘం ప్రధాన కార్యదర్శి మరుడ శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు బైరెడ్డి పోతనరెడ్డి, కోశాధికారి, వాకాడ బాపిరెడ్డి, సహాయ కార్యదర్శి ఎం.వి.శ్రీనివాస్‌రెడ్డి, చిన్నిపిల్లి రామిరెడ్డి, చాట్ల ఎల్లయ్యరెడ్డి, మధ్యప్రసాద్ రెడ్డి, పిడింట్ల ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

## కాలువల వద్ద రక్షణ గోడలేవి..?





జోడుగుళ్లపాలెం వద్ద పిల్లల పార్కుకు ఇరువైపులా రక్షణ గోడలు లేని కాలువలు

**ఆరిలోవ:** జీవీఎంసీ 9వ వార్డు జోడుగుళ్లపాలెం వద్ద బీచ్ రోడ్డును ఆనుకుని అధికారులు పిల్లల పార్కు నిర్మించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పనులు ప్రారంభం కాగా.. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అవి నిలిచిపోయాయి. స్థానికుల ఫిర్యాదులతో అధికారులు నాలుగు నెలల కిందట పార్కు పనులు పూర్తి చేశారు. ఆ సమయంలో పార్కు ముందున్న కాలువకు రక్షణ గోడలు నిర్మించడం మరిచిపోయారు. ఈ పార్కు ప్రధాన ద్వారం ముందు ఇరుపక్కలా లోతైన కాలువ ఉంది. ఇది ప్రధాన రహదారికి నాలుగడుగుల లోతులో ఉండటంతో గెడ్డను తలపిస్తోంది. పిల్లలను తీసుకొచ్చే వారి వాహనాలను ద్వారం వద్ద కాలువ ముందు నిలుపుతున్నారు. ఆ సమయంలో అదుపు తప్పి వాహనాలు, అటుగా వెళ్లే పిల్లలు కాలువలో పడే ప్రమాదముందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా పార్కు ద్వారానికి ఇరుపక్కలా ఉన్న కాలువకు రెండు, మూడడుగుల ఎత్తులో రక్షణ గోడలు నిర్మించాలని కోరుతున్నారు.